**అటవీరెవెన్యూ భూవివాదాలపై సబ్ కలెక్టర్ సమీక్ష**




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

**ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్న బండి శ్రీధర్**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 115 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 22 ఏప్రిల్ 2026


# ప్రధాని మోదీ ఓ ఉగ్రవాది..

### కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు



**చెన్నై,21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రధాని మోదీ ఓ ఉగ్రవాది అని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయన ప్రత్యర్థులను బెదిరించి, భయపెడతారని.. ఆ అర్థంలోనే ఆ పదం వాడానని తన వాఖ్యలపై వివరణ ఇచ్చారు. సోమవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీతో ఏఐఏడీఎంకే పొత్తు పెట్టుకోవడం గురించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు ఎలా మోదీతో కలుస్తారు? ఆయనొక ఉగ్రవాది. ఆయనకు సమానత్వంపై

మిగతా2లో...

# రూల్ ఆఫ్ లాకు లోబడి సేవలు

### - సివిల్ సర్వెంట్స్‌కు సిఎస్ సూచనలు




**అమరావతి,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సివిల్ సర్వెంట్స్ రూల్ ఆఫ్ లాకు లోబడి సేవలు అందించేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..సివిల్ సర్వెంట్‌లు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలని అన్నారు. నిరంతరం విజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలని సూచించారు. భారతదేశ పరిపాలన వ్యవస్థకు సివిల్ సర్వెంట్లు వెన్నెముక వంటివారని

మిగతా2లో...

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

### రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై

మిగతా2లో...

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా...

- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరపున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో

మిగతా2లో...



# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

### నార్వే బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్

మిగతా2లో...

# తెలంగాణకు 8 కొత్త రైళ్లు

**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రైల్వే మంత్రిత్వ శాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు భువనేశ్వర్, తిరుచానూరు, తిరుపతి, శ్రీ గంగానగర్, జైపూర్ వంటి ముఖ్యమైన నగరాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం




మరింత సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ రైళ్లు మే నుంచి జూలై మధ్య దశల వారీగా ప్రారంభం అవుతాయి. రైళ్లన్నీ వారానికి ఒకసారి నడుస్తాయి. కాగా, తెలంగాణకు ఎనిమిది రైళ్లను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా..?
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు

మిగతా2లో...

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ

### కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి

మిగతా2లో...



# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

### తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు

### తాజా రాజకీయ పరిణాలపై చర్చించే ఛాన్స్

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు

మిగతా2లో...

# సమ్మె ఆలోచన విరమించండి

చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

విభజనపై ఎంపి తేజస్వీ వ్యాఖ్యలపై చంద్రబాబుకు లేఖ



# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా...

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.

కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

## ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఏదీ

### ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న వెల్లడి




**హైదరాబాద్,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపక పోవడం విచారకరమన్నారు. 22 నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడా రు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన పక్రియ ఇప్పటికీ మొదలుపెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తు న్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికా రులు, ప్రభుత్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారం లోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీ ర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ చైర్మన్ వెంకన్న. సమ్మె చేయ కుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అంద రూ సమ్మె చేయడానికీ సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నా రని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం.

ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

# సమ్మె ఆలోచన విరమించండి



**హైదరాబాద్,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెను వెంటనే విరమించాలని వారికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మీ సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కార్మికులకు ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసి బలోపేతానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రయాణికుల దృష్టిలో ఆలోచించాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికిప్పుడు చర్చకు తాము సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు వద్దంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొనడం బాధాకరమన్నారు. హైడ్రాను రద్దు చేస్తామంటే కబ్జాదారులకు మద్దతు ఇవ్వడమేనని మంత్రి పొన్నం అభిప్రాయపడ్డారు. జగిత్యాలలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ భారీ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను రద్దు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి వద్దని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల పొన్నం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్‌కు లేఖ రాయాలి. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చూడాలి. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం అని లేఖలో పొన్నం పేర్కొన్నారు. తన వినతిని అర్థం చేసుకుని తగిన విధంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ప్రధాని మోదీ ఓ ఉగ్రవాది..

(మొదటి పేజీ తరువాయి)

నమ్మకం లేదు. ఆయన పార్టీ సమానత్వాన్ని, న్యాయాన్ని నమ్మదు. వీళ్లు వెళ్లి వాళ్లతో కలుస్తున్నారు. దానర్థం ప్రజాస్వామ్యాన్ని వాళ్లు బలహీనపరుస్తున్నారనే' అని ఖర్గే ధ్వజమెత్తారు.

# రూల్ ఆఫ్ లాకు లోబడి సేవలు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.. వీరి అంకితభావాన్ని, నిరంతర కృషిని గౌరవిస్తూ ప్రతి ఏడాది ఏప్రిల్ 21న జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అధికారులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని సీఎస్ పేర్కొన్నారు.

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్ధలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

# కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూ డదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లకైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.ద

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరిచారు. వెంటనే ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్లైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ఎ÷-లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో ఖచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

## 95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామ: మంత్రి

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# అటవీరెవెన్యూ భూవివాదాలపై సబ్ కలెక్టర్ సమీక్ష

**పెండింగ్ సమస్యల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు**

**సరిహద్దుల నిర్ధారణ, శాఖల సమన్వయంపై దిశానిర్దేశాలు**



**కల్లూరు, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొనసాగుతున్న అటవీ, రెవెన్యూ భూవివాదాలు, భూసరిహద్దుల నిర్ధారణ (బౌండరీ ఫిక్సేషన్), భూ రికార్డుల సమన్వయం, ఆక్రమణల నివారణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వివాదాస్పద భూముల విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. భూసరిహద్దులను ఖచ్చితంగా గుర్తించేందుకు ఫీల్డ్ స్థాయిలో సర్వేలు చేపట్టాలని, అటవీరెవెన్యూ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, తేడాలను సరిచేయాలని ఆదేశించారు. అక్రమ ఆక్రమణల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలకు సమయానుకూల పరిష్కారం అందించడంలో అధికారు లు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమా వేశం ద్వారా భూవివాదాల పరిష్కారానికి వేగం పెరు గుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్య ద్వారానే క్రమ-శిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

**విద్యతోపాటు సామాజిక అంశాల్లో అవగాహన కలిగి ఉండాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్.**



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్21(పి.సి.డబ్ల్యూ న్యూస్):** విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభం అయిన నేపథ్యంలో రెండవ రోజు మహాత్మ జ్యోతిరావు పూలే, పత్తిపాక లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు, ఈ రోజు కిచెన్ క్లీనింగ్, సానిటేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, పరిసరాల పరిశుభ్రత, హెల్మెట్ సీట్ బెల్ట్ రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని పరీక్షించడం కోసం క్విజ్ పోటీలు, బాలల హక్కుల, కార్యక్రమాలు, బాలల హక్కులు, విద్య మరియు ఆరోగ్య అవగాహనపై వీధి నాటకాలు, సామాజిక న్యాయం, విద్య మరియు పర్యావరణం – ఆంగ్లంలో తెలుగులో చర్చ ప్రసంగా లు సామాజిక న్యాయ, ప్రకృతి సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణ పై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించారు .కేవలం విద్య ద్వారానే క్రమశిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పట్టుదల ఏకాగ్రత తో విద్యను అభ్యసించాలని, అలాగే శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు, అందుకోసం క్రమం తప్పకుండా వ్యాయామం సమయాను కూలంగా పుస్తకాలు చదవాలన్నారు .అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలను సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణ సామాజిక అంశాలపై నిర్వహించిన వ్యాసరచన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారిని అభినందించారు. ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలలో కామన్ డైట్ మెనూ ప్రవేశపెట్టి పిల్లలందరికీ రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు విద్యను అభ్యసించడం కోసం సంబంధిత విద్య సిబ్బంది ఏర్పాట్లు చేయాలని అన్నారు. పిల్లలకు, భోజనం సిద్ధం చేసే సిబ్బంది కి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి, అట్టి నివేదికలను సమర్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపల్ రాజేష్, పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులను మే చివరికల్లా పూర్తి చేయాలి

**నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ పనులను వేగవంతం చేసి మే నెల చివరి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత పురోగతిపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు. రాపర్తి నగర్ మెయిన్ రోడ్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను కమిషనర్ స్వయంగా తనిఖీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఈ డ్రైనేజీ పనులను తక్షణమే వేగవంతం చేసి మే నెల చివరి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 17వ డివిజన్ పరిధిలో జరుగుతున్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల్లో జాప్యం వహించరాదని, నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. 46వ డివిజన్ పరిధిలోని అండర్ పాస్ బ్రిడ్జ్ నుండి అప్రోచ్ రోడ్డు వరకు జరుగుతున్న పనుల పురోగతిని కమిషనర్ పరిశీలించారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురా వాలని అధికారులకు స్పష్టం చేశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎక్కడా కూడా పెండిం గ్‌లో ఉండకూడదన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ పనుల విషయంలో మే నెలాఖరు గడువును ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎటు వంటి రాజీ పడకూడదన్నారు. ఈ తనిఖీ కార్యక్రమ ంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బందిలు పాల్గొన్నారు.

# కల్లూరు మార్కెట్ యార్డ్‌లో పీపీసీ కేంద్రం తనిఖీ

**రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి**

**మిల్లర్ ట్యాగింగ్, గన్నీ సంచులపై సబ్ కలెక్టర్ సమీక్ష**



**కల్లూరు, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన పీపీసీ (ప్యాడీ ప్రోక్యూర్‌మెంట్ సెంటర్) కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను దగ్గరగా పరిశీలించి, రైతులతో మరియు కేంద్ర ఇన్‌చార్జ్‌లతో ప్రత్యక్షంగా మాట్లాడారు. మిల్లర్ ట్యాగింగ్ ప్రక్రియ, గన్నీ సంచుల సమీకరణ, ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు వంటి కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, అమలవుతున్న విధానాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సవివరంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూ చించారు. గన్నీ సంచుల కొరత లేకుండా తగిన చర్య లు తీసుకోవాలని, మిల్లర్ ట్యాగింగ్‌ను వేగవంతం చే యాలని ఆదేశించారు. అలాగే ధాన్యం తూకం, రవా ణా, చెల్లింపుల ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశా రు. రైతుల సంక్షేమం దృష్ట్యా అవసరమైన అన్ని సదు పాయాలను కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్శనతో కేంద్రశీ పనితీరు మెరుగు పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్న బండి శ్రీధర్



**పరకాల, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 16వ వార్డు అంబేద్కర్ సెంటర్ పరిధిలో గత ఐదు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందుఎలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే ప్రజా నాయకుడు బండి శ్రీధర్ స్పందిం చారు. సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకొని వేగంగా స్పందించడం ద్వారా బండి శ్రీధర్ మరోసారి ప్రజా నాయకుడిగా తన బాధ్యతను చాటుకు న్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ, పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. 16వ వార్డు నాయకులు ఐలపెల్లి స్వామి, బండి రాజు, గోవింద ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వివరించగా, త్వరితగతిన పరిష్కారం లభించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# సీరోల్ మండల ఆర్యవైశ్య అధ్యక్షులకు జన్మదిన శుభాకాంక్షలు

**● తెలియజేసిన రైతు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు**







**సిరోల్ ఏప్రిల్21(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతాపని పుల్లయ్య పుట్టినరోజు సందర్భంగా వారీ స్వగృహం తాళ్ళసంకిస పాఠశాలలో చిన్నారుల మధ్య సన్మానించి జన్మదిన ఆత్మ కమిటీ చైర్మన్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపనీ రవి కుమార్,మాజీ సర్పంచ్ దేవేందర్,ఉపేందర్,మహేష్,వెంకటేష్, ప్రశాంత్, ఉపాధ్యాయులు రాజు, సంధ్య,అంగన్వాడీ టీచర్లు,ఉమ,వనజ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని బెంగళూరులో అన్నదానం

**● జనసేన నేత కోలా సోమశేఖర్ ప్రత్యేక పూజలు**





**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం సంపూర్ణంగా కుదుటపడాలని ఆకాంక్షిస్తూ పుంగనూరు నియోజకవర్గ జనసేన నాయకులు కోలా సోమశేఖర్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని బెంగళూరులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమంలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని ఆయన అన్నారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని కోరుకుంటూ ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న శాఖలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఆయన కొనియాడారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, వినూత్న పాలనతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని గుర్తు చేశారు.

# కొండపల్లి రఘురామ్ రెడ్డి మాతృమూర్తికి నివాళులు

● రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ నాయక్



**సీరోల్ ఏప్రిల్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండపల్లి రఘురామ్ రెడ్డి మాతృమూర్తి కొండపల్లి పద్మిని దేవి మరణవార్తను తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ నాయక్ వారి పార్థివాదేహం వద్ద నివాళులర్పించి వారి కుమారులు కొండపల్లి శ్రీనివాస్ రెడ్డి,రఘురామ్ రెడ్డి లను పరామర్శించారు.

# అన్న ప్రసన్న వేడుకలో పాల్గొన్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోతు నెహ్రూ నాయక్



**సీరోల్ ఏప్రిల్ 21 (పిసీడబ్ల్యూ న్యూస్):** మండలం ఉప్పరగూడం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు అశోక్‌బిసుజాతల కుమారుడు అన్నప్రసన్న వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోత్ నెహ్రూ నాయక్ వారి వెంట కురవి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గూగులోతు నవీన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నూతన కార్యదర్శికి సన్మానం చేసిన గ్రామ సర్పంచ్



**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** గత వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామపంచాయతీలో గల కార్యదర్శులను బదిలీ చేశారు. గతంలో గుర్తుర్ గ్రామ పంచాయతీలో ఉన్న అంజాద్ అలీ దంతాల పెళ్ళికి బదులుగా వారి స్థానంలో మహబూబా బాద్ నుండి నూతన కార్యదర్శిగా జబ్బాని గుర్తుర్ గ్రామపం చాయతీ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతన కార్యదర్శికి గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ వారితోపాటు వార్డు సభ్యులు , గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు.

# నేడు నంద్యాలలో వైకాపా జిల్లా స్థాయి సమావేశం

**నంద్యాల ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధనే లక్ష్యంగా బుధవారం నంద్యాలలో వైకాపా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. చామకా లువ సమీపంలోని అన్నపూర్ణ హోటల్ వేదికగా ఉదయం 10 గంటలకు ఈ భేటీ ప్రారంభం కానుంది. జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, కాకాని గోవర్ధన్ రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సాకే శైలజానాథ్, తలారి రంగయ్య హాజరుకానున్నారు.ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుంటూ రాయలసీమ రైతులకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు, రేవంత్ రెడ్డిల వైఖరిని నిరసిస్తూ, ప్రాజెక్టు సాధన కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు

● కలెక్టర్ చిత్రా మిశ్రా చొప్పదండిలో వసతి గృహం ఆకస్మిక తనిఖీ





**గంగాధర ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి లో ఈరోజు విద్యార్థుల భద్రతకు, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చొప్పదండిలోని ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ హాల్, భోజనశాల పరిశీలించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది హాస్టల్లోనే ఉండాలని.. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపిఓ జగదీశ్వర్, తహసిల్దార్ నవీన్ కుమార్, వార్డెన్ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

# తొర్రూరు పట్టణంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

● ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరు



**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం లోని యువతకు అన్ని మంచి రోజులే. తన సొంత డబ్బులతో యువతకు శిక్షణ తరగతులను ఇప్పిస్తానని ప్రకటించిన దాని ప్రకారంగానే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గం లోని యువతకు కంప్యూటర్ శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు యువతకు డిజిటల్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు.యువతకు ఉచితంగా కంప్యూటర్ జ్ఞానం, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ మరియు డిజిటల్ సేవలపై శిక్షణ అందించబడుతుంది. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు కూడా ఇవ్వబడనున్నాయి.మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలకుర్తి నియోజకవర్గం యువతకు మంచి అవకాశాలు తీసుకురానున్న ఆశాభావం వ్యక్తం అవుతుంది.ఈ కార్యక్రమంలో తోరూర్ మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. వారితోపాటు కంప్యూటర్ శిక్షణ కోసం వచ్చిన యువతీ యువకులు హాజరయ్యారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 'కృష్ణవేణి' ప్రభంజనం



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో 'కృష్ణవేణి' కళాశాల ప్రభంజనం సృష్టించిందని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు అన్నారు. ఖమ్మం నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో మంగళవారం జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ఏ.శిశిర్ సాయి-1355, ఈ.హర్షిత్-3311, వివిఎస్ఎస్ లక్ష్మి-4513, ఏ. మోక్షిత సాయి-5144 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. రిజర్వేషన్ కేటగిరి విభాగంలో డి.అలేఖ్య - 41, కె. స్టాన్లీ చరణ్-59, టి.సంతోష్ కుమార్-360, వి.ఎస్.ఎస్ లక్ష్మి-529, సి.హెచ్ శైలజ-559, ఎ.మోక్షిత సాయి-609, బి సంతోష్-1259, ఎ.చరణ్-1891, బి.కార్తీక్-2016, జె.అఖిల్-2803, ఎ.గణేష్-3059, బి.సింధు-3362, జె.చరణ్ తేజ్ 3598, ఎం.చైతన్య లహరి-3659, ఎం.వెంకటేశ్వర్లు-4022, డి.రామాద్రి-4529, బి.అరవింద్-5535, బి.సిద్దు-5674, హెచ్.జగదీష్-5958 లు ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన, సమయపాలన, క్రమశిక్షణతో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి కృష్ణవేణి కళాశాల ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించగలిగామన్నారు. రెండు సంవత్సరాలు పడ్డ కష్టానికి ఉత్తమ ఫలితాలతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం సంతోషంగా ఉన్నామన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ కుమార్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పున్నేలులో విజయోత్సాహం

● సర్పంచ్ ఉస్మాన్ అలీ, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు జిల్లా దయాకర్‌లకు ఘన సన్మానం




**ఐనవోలు, ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో రాజకీయ, సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. గ్రామాభివృద్ధే ధ్యేయంగా భారీ మెజారిటీతో సర్పంచ్‌గా విజయం సాధించిన ఎస్.కె. ఉస్మాన్ అలీ, పున్నేలు గ్రామ అంబేద్కర్ యూత్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా దయాకర్ లను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు జిల్లా సతీష్, జిల్లా సంపత్ లు వారిని శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో నిరంతరం ముందుంటూ, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జిల్లా దయాకర్ ప్రత్యేక సహకారం అందిస్తూ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులందరి సహకారంతో, సమిష్టి కృషితో పున్నేలు అభివృద్ధికి బాటలు వేస్తామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువతను ఐక్యం చేస్తూ ముందుకు సాగుతామని నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది.

# నెల్లూరు అభివృద్ధిపై 'మంత్రి నారాయణ' మార్క్-విపక్షాలకు తాళ్లపాక అనురాధ స్ట్రాంగ్ కౌంటర్

● 15.5 లక్షలతో 42వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ● ఏసీ గదుల్లో కూర్చొని విమర్శలు చేయటం మాని క్షేత్రస్థాయికి వచ్చి చూడండి ● ప్రతిపక్షాలపై ధ్వజమెత్తిన అనురాధ ● క్వాలిటీ లేకపోతే పగలగొట్టించిన చరిత్ర మాది.



**నెల్లూరు ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి నారాయణ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఏసీ గదుల్లో కూర్చుని ప్రెస్ మీట్లు పెట్టే వారు క్షేత్రస్థాయిలోకి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూడాలని సూచించారు .42వ డివిజన్ పరిధిలోని రహమతియా మసీదు ప్రాంతంలో 15.5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణం, సీసీ రోడ్డు,110 ఎవ్రాఎజ పైపులైన్ పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే తిరిగి అదేపనిని కాంట్రాక్టర్ తో చేయించిన చరిత్ర మంత్రిదని గుర్తు చేసారు.మంత్రికి అభివృద్ధి తప్ప ఎవరి మీదా వ్యక్తిగత కక్షలు ఉండవన్నారు .సీటీ నియోజక వర్గంలో ఇప్పటివరకూ చేసిన అభివృద్ధిని డివిజన్ల వారీగా ప్రజలచెంతకు తీసుకువెళ్లి విపక్ష కుట్రలను తిప్పికొడతామన్నారు .ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ షేక్ కరీముల్లా, డివిజన్ కో-క్లస్టర్ సయ్యద్ మోయినుద్దీన్, డివిజన్ ప్రెసిడెంట్ షేక్ ఖలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ అహ్మద్, పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి షేక్ కాలేషా, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఉమర్, నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇంతి యాజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నౌషాద్,స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి

● శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవానికి ఎంపీకి ఆహ్వానం

**పులివెందుల ఏప్రిల్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కడప జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం పులివెందులలోని తన స్వగృహం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలతో ఆయన నేరుగా మమేకమై వారి విన్నపాలను స్వీకరించారు.విద్య,వైద్యం, మరియు మౌలిక వసతులపై వచ్చిన వినతులను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.వాసవి కాలనీలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ విన్నపంపై స్పందించిన ఎంపీ,తప్పకుండా స్వామివారి వేడుకలకు హాజరవుతానని వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మిట్ట హరి, పుల్లగూర సుధా, గోపాల్, మురళి, వెంకటసుబ్బయ్య మరియు ఇతర కమిటీ సభ్యులతో పాటు వైకాపా నాయకులు,కార్యకర్తలు మరియు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఘనంగా డీసీసీ అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

**• సేవా కార్యక్రమాలతో**

**ఆకట్టుకున్న కాంగ్రెస్ నాయకులు**





**కల్లూరు, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జన్మదినాన్ని కల్లూరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో కేక్ కట్ చేసి ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరితంగా సాగగా, నాయకులు గౌడ్ సేవా భావం, నాయకత్వ లక్షణాలను ప్రత్యేకంగా కొనియాడారు. పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు ఇజ్జగాని శ్రీలత, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు, కిసాన్ విభాగం ఉపాధ్యక్షులు యలమరెడ్డి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా కార్యక్రమాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, పట్టణంలోని ప్రధాన రహదారుల వద్ద ఆటోలలో, బస్సులలో వెళుతున్న ప్రయాణికులకు, పాదాచారులకు చల్లటి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాటసారులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు, వేసవి వేడి ప్రభావం వంటి సమస్యలను దృష్టిలో



ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతను ప్రతిబింబించింది. అలాగే కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పి పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులు, వారి కుటుంబ సభ్యులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న సహాయం అయినప్పటికీ, ఇలాంటి మానవతా కార్యక్రమాలు రోగులకు మానసికంగా ధైర్యాన్ని ఇస్తాయని ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జన్మదినాన్ని కేవలం వ్యక్తిగత వేడుకగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా జరుపుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నూతి సత్యనారాయణ గౌడ్ ఆలోచనలు, సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాల ద్వారా ప్రజలతో మరింత అనుబంధం పెరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు పార్టీకి మరింత గౌరవాన్ని తీసుకువస్తాయని చెప్పారు. మొత్తం మీద, ఈ జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా సేవా భావంతో సాగడం ప్రత్యేకతగా నిలిచింది. ప్రజల మధ్యకి వెళ్లి, వారి అవసరాలను గుర్తించి సహాయం చేయడం ద్వారా నాయకులు తమ బాధ్యతను చాటారు. నూతి సత్యనారాయణ గౌడ్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు సమాజంలో సేవా తత్వాన్ని పెంపొందించే దిశగా ఆదర్శంగా నిలిచాయి.

# ధాన్యం కొనుగోలు ఆలస్యం రైతుల పట్ల అన్యాయం

**తల్లాడలో రైతులతో కలిసి ధర్నా**

**తాసిల్దార్‌కు వినతి పత్రం**

**కొనుగోలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్**

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు**

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆగ్రహం**





**తల్లాడ, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తల్లాడ మండలంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన నేతృత్వంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతుంటే అధికారులు మాత్రం స్పందించకపోవడం దారుణం అన్నారు. కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగకపోవడం రైతుల పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఘాటుగా విమర్శించారు. ధాన్యం తడవకుండా, నష్టపోకుండా వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు కష్టానికి సరైన విలువ దక్కాలి అని తెలిపారు. ఆలస్యం వల్ల ధాన్యం నాణ్యత తగ్గిపోతే బాధ్యత ఎవరిది...? రైతు అప్పుల్లో కూరుకుపోతే ప్రభుత్వం సమాధానం చెప్పాలి అంటూ ప్రశ్నించారు. రైతు సంక్షేమం గురించి మాటల్లో చెప్పడం కాకుండా చర్యల్లో చూపాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నా అనంతరం రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తల్లాడ మండల తహసిల్దార్ కరుణాకర్ రెడ్డికి అందజేశారు. వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సొసైటీ కార్యాలయం వద్ద నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్న రైతుల ఆవేదనను తెలుసుకుని వారికి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు సహా పలువురు స్థానిక నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వెల్లడించారు.



మొత్తం మీద తల్లాడలో జరిగిన ఈ ధర్నా రైతుల ఆవేదనకు ప్రతీకగా నిలిచింది. ధాన్యం కొనుగోలు సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని సండ్ర వెంకట వీరయ్య తెలిపారు.

# కాంగ్రెస్ సర్కార్‌కు 24 గంటల డేడ్ లైన్..!?

**- డంపింగ్ యార్డ్ పై ప్రభుత్వ నిర్ణయం స్పష్టం**

**చేయాలి.. లేకపోతే ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం...**

**- జనాలు డంపింగ్ యార్డ్ వద్దని గగ్గోలు పెడుతున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా..? వినిపించడం లేదా..? హుజురాబాద్ ప్రజలపై ఎందుకింత కక్ష...?**

**- నెలరోజులైనా ప్రభుత్వం స్పందించక**

**పోవడానికి కారణం ఏంటి..?**

**- హుజురాబాద్ కాంగ్రెస్ నేతలు, మున్సిపాలిటీ పాలకవర్గం**

**డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఎందుకు మాట్లాడటం లేదు..**

**ప్రభుత్వంతో ఎందుకు ప్రకటన చేయించడం లేదు...?**


**- మీడియా సమావేశంలో గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు....**



**హుజురాబాద్,ఏప్రిల్21(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో డంపింగ్ యార్డు రద్దు విషయంలో ప్రభుత్వం నుంచి 24 గంటల్లో స్పష్టమైన ప్రకటన రాకపోతే, ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా హెచ్చరించారు. మంగళవారం రోజున హుజురాబాద్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గంగాడి కృష్ణారెడ్డి పై వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడారు. డంపింగ్ యార్డ్ రద్దు నిర్ణయంపై పై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి 24 గంటల డెడ్ లైన్ విధిస్తున్నామని , ఈలోగా కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, స్పష్టమైన ప్రకటన చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. హుజురాబాద్ జనాలు డంపింగ్ యార్డ్ వద్దని నెల రోజులుగా గగ్గోలు పెడుతున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా..? వినిపించడం లేదా..? ఆయన ప్రశ్నించారు. హుజురాబాద్ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలంతా నిద్రాహారాలు మాని , రోడ్డెక్కిన, నిరసనలు, ఆందోళనలు చేపట్టిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ వద్దని, రద్దు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు, ఆందోళన కార్యక్రమాలు నెల రోజులుగా చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించక పోవడానికి కారణం ఏంటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజల మనోభావా లను అర్థం చేసుకోకుండా, గుర్తించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రజావ్యతిరేక తనుమూటగట్టుకుందన్నారు రాష్ట్ర ప్రభుత్వంమొండి వైఖరి

## జిల్లాలో ఏప్రిల్ 27న "నిధి ఆప్కే నికట్ 2.0" కార్యక్రమం

**• ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్**




**కడప ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :**జిల్లాలో ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ , ప్రాంతీయ కార్యాలయం, కడప వారి ఆధ్వర్యంలో ఈపీఎఫ్ఓచందాదారులు, వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏప్రిల్ 27వ తేదీన నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ ప్రకటనలో తెలిపారుఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా నిర్వహిస్తున్న "నిధి ఆప్కే నికట్ 2.0" కార్యక్రమంలో భాగంగా, ఏప్రిల్ నెలకు సంబంధించిన కార్యక్రమాన్ని 27.04.2026 తేదీ సోమవారం జిల్లాలోని బద్వేల్‌లోని సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ వేదికగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈపీఎఫ్ఓ చందాదారులు, వినియోగదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మరియు సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మహిళలు పిల్లలు పై జరుగుతున్న దాడులపై ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీసుల అవగాహన సదస్సు




**ప్రొద్దుటూరు ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మరియు ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ విభుకృష్ణ, పర్యవేక్షణలో ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం నందు అంగన్వాడీ టీచర్స్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా శక్తి టీం మరియు మహిళలకు - మహిళలు, పిల్లలపై జరుగుతున్న దాడులకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. శాసనసభ్యులు వరదరాజుల రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని తన అపారమైన అనుభవంతో మహిళలకు సంబంధించిన విషయాలను గురించి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ రవిచంద్ర రెడ్డి మెప్మా మహాలక్ష్మి మరియు ఎస్సై శ్రీనివాసులు మధుసూదన్ రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## నేడు ఇప్పట్లకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక

**లింగాల ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామానికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం (22న) ఉదయం 9.45 గంటలకు రానున్నారు. ఇప్పట్ల గ్రామానికి చెందిన వైకాపా నేత సుధాకర్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా వైకాపా నేత సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శిస్తారు. అనంతరం పులివెందులలోని భాకరాపురంలో ఉన్న తన క్యాంప్ కార్యాలయానికి చేరుకొని సాయంత్రం 6.35 నిమిషాల వరకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

## కొత్త పెన్షన్ల కోసం పేదల ఎదురుచూపులు



**లింగాల ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని గ్రామాల్లో కొత్త ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం అర్హులైన పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో చివరి సంవత్సరం కొత్తవి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి గురించి పట్టించుకోలేదు. దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం సామాజిక పెన్షన్లకు పెద్దపీట వేస్తున్నా కొత్త పెన్షన్ల జోలికెళ్లడం లేదు. మండల పరిధిలోని గ్రామాల్లో పలువురు అర్హులు కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో పెన్షన్ కోసం దరఖాస్తులు తీసుకోవడం లేదు. ప్రభుత్వ అనుమతి రాగానే తీసుకుంటామని సచివాలయ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే పెన్షన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న మొత్తంఎక్కువగా ఉంటోంది. దీంతో కొత్తపెన్షన్ల మంజూరు పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

# కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి**

**విజయం తర్వాత ఆగకుండా**

**ఇంకా ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

**విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి**

**ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థు లను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, కష్టపడి పని చేస్తే ఎంతటి విజయమైనా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. తన చిన్నతనంలో తనకు ప్రత్యేకమైన కలలు లేదా ఆత్మవిశ్వాసం లేవని, అయితే ఇంటర్ ఫలితాలు తనలో నమ్మకాన్ని పెంచాయని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమనే విశ్వాసం అప్పుడు కలిగిందని చెప్పారు. ప్రస్తుతం మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిలో ప్రతిభ, మేధస్సు ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇప్పటితోనే ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, మంచి కళాశాలలో సీటు పొందేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని తెలిపారు. మంచి విద్యా సంస్థల్లో చదవడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు, జీవన శైలీలు తెలుసుకునే అవకాశం ఉంటుందని, ఎప్పుడూ తక్కువగా భావించకూడదని సూచించారు. కష్టపడి పనిచేస్తూ, మనపై మనం నమ్మకం ఉంచితే ఏ లక్ష్యమైనా సాధ్యమని పేర్కొన్నారు. విజయం సాధించిన వారిలో మేధస్సు, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కష్టపడే స్వభావమనే మూడు ముఖ్య లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఒకసారి విజయం సాధించిన తరువాత అక్కడే ఆగిపోకుండా ఇంకా ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి పరిజ్ఞానాన్ని సాధించే దిశగా కృషి చేస్తే విజయం సహజంగా వస్తుందని, వైఫల్యాలు మనల్ని ఆపకూడదని చెప్పారు. జీవితం అనేది సవాళ్లతో నిండినదని, వాటిని ఎలా అధిగమిస్తామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. కష్టాల ద్వారా వచ్చిన ఫలితాలు మరింత విలువైనవని తెలిపారు. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ ఉంటాయని, ఒక అవకాశం కోల్పోయినా మరో అవకాశం వస్తుందని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో పట్టుదలగా ఉండాలని సూచించారు. అడ్డంకులు, వైఫల్యాలను పాఠాలుగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల విద్యను నేర్చుకోవడం సులభమైందని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్‌ను సానుకూలంగా వినియోగిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి నెల ఒక కొత్త పుస్తకం చదివే లక్ష్యాన్ని పెట్టుకోవాలని సూచించారు. చదివిన విషయాలను రాసుకునే అలవాటు పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ.. విద్యార్థులను తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థిని వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని, వాటి సాధనకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను చూసి కృషి చేసి మంచి ఫలితాలు సాధించామని చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఇకపై విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని, ఆ పరీక్షలలో మూడు గంటల సమయం ఎంతో కీలకమని, ముందుగానే సమగ్రంగా సిద్ధం కావాలని సూచించారు. మనకంటే ఎక్కువ కష్టాలు ఎదుర్కొనే వారు ఎంతో మంది ఉన్నారని గుర్తుంచుకుని ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కాలేజీల్లో నిర్వహించిన ప్రత్యేక తరగతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంలో ఎంతో సహాయ పడ్డాయని తెలిపారు. ఆ తరగతుల వల్లే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించ గలిగామని పేర్కొన్నారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, లెక్చరర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రభుత్వ విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఆర్జేసీ, స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్, అంబేద్కర్ కళాశాల, మోడల్ కాలేజీ ఎస్ఓలు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

---

# జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**కర్నూలు ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పత్తికొండ మండలం కొత్తపల్లి గ్రామంలోని పందికోన రిజర్వాయర్ నుండి త్రాగు నీటిని ఫిల్టర్ చేసే మైక్రో ఫిల్టర్ పంప్ హౌస్, గ్యాస్ క్లోరినేషన్ కేంద్రాలలో త్రాగునీటి శుద్ధి ప్రక్రియను, వాటర్ శాంపిల్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా త్రాగు నీటిని ఫిల్టర్ చేసే మైక్రో ఫిల్టర్ పంప్ హౌస్, గ్యాస్ క్లోరినేషన్ కేంద్రాలను పరిశీలిస్తూ వాటి నిర్వహణ ఏ విధంగా ఉంది, ఏమైనా మరమ్మతులు ఉన్నాయా అని పరిశీలించారు. రోజుకు ఎంత మేరకు నీటిని ఫిల్టర్ చేస్తారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ పరీక్ష ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఇసుక ఫిల్టర్లు ఉపయోగించి, కార్బన్ సహాయంతో మలినాలను తొలగించి, సెడిమెంటేషన్ ప్రక్రియ తర్వాత క్లోరినేషన్ చేసి గ్రామాలకు మరియు ట్యాంకులకు నీటిని సరఫరా చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన తాగునీటిని అందించేలా వ్యవస్థను మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుగానే అప్రమత్తమై, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ ను కలెక్టర్ పరిశీలిస్తూ ట్యాంక్ నిర్వహణ విధానాలను, నీటి నాణ్యతను తనిఖీ చేశారు. నీటిలో క్లోరిన్ స్థాయిలను పరీక్షిస్తున్న విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తూ, శుద్ధి ప్రక్రియ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి నమూనాలను పరీక్షించాలని (వాటర్ శాంపిల్ టెస్టింగ్) మరియు క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆర్ .డబ్ల్యు.ఎస్ అధికారులను ఆదేశించారు ట్యాంక్ ను క్లోరినేషన్ చేసిన తేదీ, శుభ్రపరచిన తేదీ వివరాలను ఖచ్చితంగా రాయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 33 సి.పి.డబ్ల్యు.ఎస్ (సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా) పథకాలు, 800 పి.డబ్ల్యు.ఎస్ (రక్షిత మంచినీటి సరఫరా) పథకాలు మరియు 1200 మినీ పి.డబ్ల్యు.ఎస్ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు దాదాపు 300 బోర్ వెల్స్ మరియు 1000 హ్యాండ్ పంప్స్ (చేతి పంపులు) ఉన్నాయన్నారు. జాణూ పథకం కింద 53 పనులకు మంజూరు లభించిందని, వీటిని త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ మందికి ఉపయోగపడే పనులను గుర్తించడం జరిగిందని, ఇందుకోసం కుడా నిధుల నుండి దాదాపు రూ. 3.5 కోట్ల నుండి 4 కోట్ల రూపాయలను కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బి.సి వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ మరియు అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో త్రాగునీరు మరియు మరుగుదొడ్ల సమస్యల పరిష్కారం కోసం 2.3 కోట్ల రూపాయలు మంజూరు చేసి, సంబంధిత పనులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పందికోన రిజర్వాయర్ ను పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం నీటి స్థాయి గురించి కలెక్టర్ అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

---

# పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయండి

**• గోల్డ్ మైన్స్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**కర్నూలు ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పత్తికొండ ఆర్డీఓ ను ఆదేశించారు. మంగళవారం తుగ్గలి మండలం జొన్నగిరి లోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ జొన్నగిరి గోల్డ్ మైన్స్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్లాంట్ లో ప్రారంభ దశ నుండి బంగారం ఉత్పత్తి అయ్యే చివరి దశ వరకు ఉన్న ప్రతి ఒక్క విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా ప్లాంట్ మొత్తం తిరిగి పరిశీలించారు. సందర్శన అనంతరం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ జడ్.ఎంలతో, సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పత్తికొండ ఆర్డీవో, తుగ్గలి తహశీల్దార్ లను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జి పత్తికొండ ఆర్డీఓ మరియు ఏపీఐఐసీ జడ్.ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్, తుగ్గలి తహశీల్దార్ రవి కుమార్ , సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ విషయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు విచారకరం

**కర్నూలు ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :**–మహిళల రిజర్వేషన్ విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత విచారకరం మరియు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ షాలి దాదా గాంధీ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లులో మైనారిటీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉండదని చెప్పడం సామాజిక న్యాయానికి తీవ్ర భంగం కలిగించే చర్యగా భావిస్తున్నాము అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన నేపథ్యంలో మైనారిటీ మహిళలను ఈ విధంగా పక్కన పెట్టడం వివక్షతను, మరింత బలపరచే ప్రమాదకర నిర్ణయం అని తెలిపారు. ఇప్పటికే సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం వారి అభివృద్ధిని అడ్డుకుంటుంది అన్నారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ తరఫున ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మహిళల రిజర్వేషన్ చట్టంలో అన్ని వర్గాల మహిళలకుప్రత్యేకంగా మైనారిటీ మహిళలకుసముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. సామాజిక న్యాయం, ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ మాజీ అధ్యక్షుడు ఎండ్లూరి లాజరస్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్ హై, డిసిసి మాజీ కార్యదర్శి వెల్దుర్తి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాద బాధితులకు అందిన ఎక్స్ గ్రేషియా.

**మధ్యవర్తుల దోపిడిపై**

**ఉప లోకయుక్త ఆందోళన.**

**విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు 35 లక్షల పరిహారం పంపిణీ.**



**కర్నూలు ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి వారసులకు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా వారికే ఎక్స్ గ్రేషియా అందేటట్లు ఉపలోకయుక్త పూర్తిస్థాయిలో బాధితులకు న్యాయం చేశారు. మంగళవారం ఉపలోకయుక్త పి. రజని విడుదల చేసిన పత్రిక ప్రకటన వివరాలు ఇలా ఉన్నాయి. 2025 వ సంవత్సరంలో నమోదైన కేసు వివరాలకు సంబంధించి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బాధితులు వారి వారసులకు విద్యుత్ శాఖ తరపున వచ్చిన పరిహారాన్ని వారి వారసులకు అందించారు. షేక్ మై మునిసా క్రైమ్ నెంబర్.2404/2025/బి1 కి రూ.5 లక్షలు,జమ్మనగల్లు లక్ష్మి క్రైమ్ నెంబర్.2405/2025/బి1 కి 5 లక్షలు, చాకలి వెంకటేశ్వర్లు క్రైమ్ నెంబర్.2407/2027/బి1 కి 5 లక్షలు, యమా రోజా క్రైమ్ నెంబర్.2408/2025/బి1 కి 5 లక్షలు, మానస కట్ల రమణ క్రైమ్ నెంబర్.2559/2025/బి1 కి ఇద్దరికీ 10 లక్షలు, కొండెబోయిన నాగమణి క్రైమ్ నెంబర్.2640/2025/బి1 కి 5 లక్షలు మొత్తం 35 లక్షలు బాధిత కుటుంబాలకు అందజేశామని తెలిపారు. ఈ పరిహారం విషయంలో కొంతమంది మధ్యవర్తులు 1.60 లక్షలు బాధితుల నుండి వసూలు చేయడం బాధాకరమన్నారు. బాధ్యత వారసులకు పరిహారం అందించడంలో సహకరించిన ఉద్యోగులకు ఉపలోకయుక్త ప్రశంసించారు. బాధితులకు అన్యాయం జరిగినప్పుడు వారు నేరుగా అధికారులను సంప్రదించి వారికి వచ్చే పరిహారాలను పొందాలని మధ్యవర్తులను ఆశ్రయించరాదని సూచించారు. ఇలాంటి విషయాలపై జిల్లా లీగల్ సర్వీస్ దాటి వారు అవగాహనలు కల్పించాలని కోరారు. పై తెలిపిన ఫిర్యాదులను పరిష్కరించినందుకుగాను వాటిని మూసివేస్తున్నట్లు ఉపలోకయుక్త తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**పత్తికొండ ఏప్రిల్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పత్తికొండ పట్టణంలోని పెద్ద ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ పత్తికొండ నియోజకవర్గ సమన్వయకర్త సీజీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీజీ రాజశేఖర్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నారని, ఆయన త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో సేవలు అందించాలని ఆకాంక్షించారు. చిరంజీవి యువత అధ్యక్షుడు వైపీ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగై ప్రజల మధ్యకు వచ్చి సేవలను కొనసాగిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రామకృష్ణ, ఇస్మాయిల్, కాజా, జయరాం, ఏవి నాయుడు, చిరంజీవి, రవికుమార్, నరేంద్ర, భాష, నవీన్, మేకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్య ఓవర్లలో పట్టు కోల్పోయాం: శుభ్‌మన్ గిల్



ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 99 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. ముంబై బౌలర్ల ధాటికి కేవలం 100 పరుగులకే చాపచుట్టేసింది. అయితే జట్టు మొత్తం బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ.. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం ఈ ఓటమికి బౌలర్లనే బాధ్యులను చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రజెంటేషన్ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ బౌలర్లు మధ్య ఓవర్లలో ధారాళంగా పరుగులు ఇచ్చేశారని అసహనం వ్యక్తం చేశాడు. పిచ్ స్లోగా ఉన్నందున ఇక్కడ 160 నుంచి 170 పరుగులు సరైన స్కోరు అని.. కానీ ముంబైని తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో తమ బౌలర్లు విఫలమయ్యారని గిల్ పేర్కొన్నాడు. సరైన లెంగ్త్‌లో బంతులు వేయకపోవడం వల్లే ముంబై భారీ స్కోరు సాధించిందని ఆయన అభిప్రాయపడ్డాడు. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్, తిలక్ వర్మ (101లి) వీరోచిత సెంచరీతో 199 పరుగులు చేసింది. నిజానికి గుజరాత్ బౌలర్ కగిసో రబాడ పవర్‌ప్లేలోనే 3 వికెట్లు తీసి ముంబైని దెబ్బతీసినా.. మిడిల్ ఓవర్లలో ఇతర బౌలర్లు తిలక్ వర్మను అడ్డుకోలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ముంబై బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో గుజరాత్ చేతుల్లోంచి మ్యాచ్ జారిపోయింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి ఎగబాకింది. ఆడిన 6 మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో 4 పాయింట్లు సాధించి నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకుంది. మరోవైపు ఈ భారీ ఓటమి వల్ల గుజరాత్ టైటాన్స్ ఆరో స్థానానికి పడిపోయింది. మూడు విజయాలు ఉన్నప్పటికీ.. రన్ రేట్ భారీగా దెబ్బతినడం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఓటమి ఓ చిన్న అడ్డంకి మాత్రమేనని, రాబోయే మ్యాచుల్లో బలంగా పుంజుకుంటామని శుభ్‌మన్ గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

**• బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా**

టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది. యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.





# చిక్కుల్లో యూసఫ్ పఠాన్

మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు మరియు మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు. దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితులను కోర్టులో హాజరుపరిచినప్పుడు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు మరియు సీసీటీవీ ఫుటేజ్ తమ వద్ద బలంగా ఉన్నాయని పోలీసులు కోర్టుకు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో,ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసుఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, ఒత్తిడి వల్ల చిన్న చిన్న కారణాలకే ప్రజలు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు సహనం పాటించకపోతే, అది ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెడుతుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. పోలీసులు పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ



ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న యువ బ్యాటర్ ఆయుష్ మాత్ర గాయం కారణంగా ఐపీఎల్ 2026 మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా ధృవీకరించడంతో సీఎస్‌కే అభిమానులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. టోర్నీ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో ఇది జట్టుకు పెద్ద లోటుగా మారింది. ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ మాత్రే బ్యాటింగ్ చేస్తుండగా కండరాల గాయానికి (హ్యామ్‌స్ట్రింగ్) గురయ్యాడు. క్రీజులో పరుగు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఆయుష్, నొప్పితో విలవిలలాడుతూ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షలు నిర్వహించిన వైద్యులు, గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేల్చారు. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. "ఆయుష్ మాత్రే ఎడమ కాలు కండరాల గాయం కారణంగా ఈ సీజన్ నుంచి తప్పుకుంటున్నాడు. అతను కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ క్లిష్ట సమయంలో అతనికి అండగా ఉంటాం, ఆయుష్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం" అని జట్టు యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్, సంజూ శామ్సన్ ఓపెనర్లుగా వస్తుండగా, మూడో స్థానంలో ఆయుష్ మాత్రే నమ్మదగ్గ ఆటగాడిగా ఎదిగాడు. కీలక సమయాల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో అతను పోషించిన పాత్ర అమోఘం. ఇప్పుడు అతను అందుబాటులో లేకపోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన ఆటగాడి కోసం కెప్టెన్, కోచింగ్ బృందం అన్వేషిస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లపై ఇప్పుడు అదనపు భారం పడనుంది. ఆయుష్ స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకునే అవకాశంపై సీఎస్‌కే ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రీహాబిలిటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు మూడు నెలలు పట్టే అవకాశం ఉండటంతో, అతను వచ్చే దేశవాళీ సీజన్ నాటికి సిద్ధమవుతాడని భావిస్తున్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న చెన్నై జట్టుకు, ఈ మార్పులు ఏ మేరకు కలిసి వస్తాయో వేచి చూడాలి.

# క్రికెట్‌లో బిష్ణోయ్ గ్యాంగ్ కలకలం

క్రికెట్ ప్రపంచంలో మరో కలకలం రేగింది. పవిత్రమైన క్రీడగా భావించే క్రికెట్‌లో మాఫియా అడుగుపెట్టిందన్న వార్త క్రీడాభిమానులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న ఈ కుంభకోణంలో కెనడా జాతీయ జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే ఇక్కడ విస్తుపోయే విషయం ఏమిటంటే... ఈ ఫిక్సింగ్ వెనుక భారత మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ ఇప్పటికే రంగంలోకి దిగి విచారణను వేగవంతం చేసింది. కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ కథనం ప్రకారం.. జూలై 2025లో బ్రిటిష్ కొలంబియాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన సంఘటన ఈ కుంభకోణానికి పునాది వేసింది. అక్కడ భోజనం చేస్తున్న కెనడా జాతీయ జట్టు స్టార్ ప్లేయర్ దగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చి, తాము బిష్ణోయ్ గ్యాంగ్ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారట. దిల్‌ప్రీత్ బజ్వాను జట్టులోకి తీసుకోవడమే కాకుండా, అతన్ని కెప్టెన్‌గా నియమించడానికి మద్దతు ఇవ్వాలని, లేదంటే అతని కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు సమాచారం. గన్ పాయింట్ బ్లాకులో పెట్టి బెదిరించి జట్టు కెప్టెన్‌ను మార్చడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్ విపరీతమైన అనుమానాలకు తావిచ్చింది. ఆ ఓవర్‌లో అతను అనూహ్యంగా పరుగులు ఇచ్చుకోవడం, బౌలింగ్ శైలి అనుమానాస్పదంగా ఉండటంతో ఐసీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. స్పాట్ ఫిక్సింగ్ జరిగిందన్న బలమైన అనుమానంతో బజ్వా మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి, అతనిపై విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే గ్యాంగ్‌స్టర్లతో అతనికి ఉన్న లింకులు బయటపడుతున్నాయి. జైలులో ఉంటూనే నెట్‌వర్క్ నడిపే బిష్ణోయ్, ఇప్పుడు క్రికెట్ బెట్టింగ్ మాఫియాలోకి కూడా ప్రవేశించాడని రిపోర్టులు చెబుతున్నాయి. కేవలం ఆటగాళ్లే కాకుండా, క్రికెట్ కెనడా ప్రెసిడెంట్ అరవిందర్ ఖోసా కూడా ఈ ముఠాకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దిల్‌ప్రీత్ బజ్వాను కెప్టెన్ చేయడంలో ఖోసా కీలక పాత్ర పోషించారని, ఇది కేవలం మ్యాచ్‌లు ఫిక్స్ చేసి డబ్బు సంపాదించడానికే అని కొందరు బోర్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.

# ఐపీఎల్‌లో క్షుద్రపూజల కలకలం..

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఒక వింత సంఘటన చోటు చేసుకుంది. సీఎస్‌కే బ్యాటర్ అవుట్ కావడానికి సరిగ్గా కొన్ని సెకన్ల ముందు, ఒక ఎస్‌ఆర్‌హెచ్ అభిమాని నిమ్మకాయతో ఏదో తంత్రం చేస్తున్నట్టుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఇది చూసిన క్రికెట్ ఫ్యాన్స్ షాక్ అయ్యారు. దీనిపై చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం బీసీసీఐకి అధికారికంగా ఫిర్యాదు చేసినట్టు ఒక లేఖ కూడా బయటకు వచ్చింది. అయితే, ఆ లేఖ ఏఐ సృష్టించిన ఫేక్ లెటర్ అని తేలినా, చర్చ మాత్రం ఆగలేదు. ఈ వివాదంపై ఐపీఎల్ వ్యవస్థాపక చైర్మన్ లలిత్ మోదీ స్పందిస్తూ ఒక పెద్ద బాంబు పేల్చారు. సీఎస్‌కే లేఖ ఫేక్ కావొచ్చు కానీ, ఐపీఎల్‌లో క్షుద్రపూజలు జరగడం మాత్రం పచ్చి నిజమని ఆయన ట్వీట్ చేశారు. "గతంలో ఒక టీమ్ ఓనర్ ప్రత్యర్థి జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటి పూజలు చేయించిన విషయం నాకు తెలుసు. 2011 సీజన్‌లోనే దీనిపై ఆధారాలతో సహా సదరు టీమ్ ఓనర్లను హెచ్చరించాను" అని మోదీ పేర్కొన్నారు. అంతేకాదు, ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడింది ఎవరో త్వరలో తాను తీయబోయే సినిమా లేదా టీవీ సిరీస్‌లో బయటపెడతానని ఒక క్లిఫ్ హ్యాంగర్ ఇచ్చారు. క్షుద్రపూజల గోల ఇలా ఉంటే, మైదానంలో ఆట మాత్రం జోరుగా సాగుతోంది. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం 11 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో వారు దుమ్మురేపుతున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరు మ్యాచ్‌ల్లో మూడు గెలిచి నాలుగో స్థానంలో ఉండగా.. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ కేవలం ఒకే విజయంతో పట్టికలో అట్టడుగున ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



# ప్యారడైజ్ కోసం రెండేళ్లు

## నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న ‘ప్యారడైజ్‘ సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ ‘ప్యారడైజ్‘ ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో ‘సైజ్ జీరో‘ కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ‘ప్యారడైజ్‘ విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.






## జూన్ 11న డ్రాగన్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు.ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. ’డ్రాగన్’ అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు



## నేను మలయాళీని కాదు.. తమిళ అమ్మాయిని

తన మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పానన్న పల్లవి

ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం తనకు లేదని వ్యాఖ్య

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన ‘రామాయణ’ చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, “మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?“ అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, “నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు“ అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, “మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది“ అంటూ తప్పుడు ప్రచారం చేశారు.
ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. “ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. నేను కోయంబత్తూరులో పుట్టి పెరిగాను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం నాకు లేదు“ అని సాయి పల్లవి వివరణ ఇచ్చింది.

## శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘రాజా శివాజీ‘ చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో ’వేద్’ వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు




## జైలర్-2 షూటింగ్ పూర్తి

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ’జైలర్ 2’ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు.



## ‘సూర్య బి పాజిటివ్‘ చిత్ర టీజర్ విడుదల

కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన ‘సూర్య బి పాజిటివ్‘ చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ డయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ డయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.

